సాక్షి సిద్దిపేట

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



నోటా.. పెరుగుతోంది వాటా!

ఓటు వేసేందుకు సరైనోడు ఒక్కడూ కనిపించడం లేదని అనుకునే వారి కోసం 'నోటా' మీటను ఎన్నికల సంఘం తీసుకొచ్చింది.

వివరాలు 10లో ▸



మార్పు కోరుకుంటున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రభాకర్ అన్నారు.

వివరాలు 10లో ▸



స్థానికేతరులకు వద్దు

అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికుడినైన తనను గెలిపించాలని జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా..

దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక: అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం దుబ్బాకలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో పలు మండలాల నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించి ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ నాయకులు టిక్కెట్లు అమ్ముకుంటున్నారని అనడం ఎంత వరకు వాస్తవమో నిరూపించాలన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో వెయ్యి ఓట్ల తేడాతో ఓడిన ఉద్యమ కుటుంబానికి చెందిన మహిళకు టిక్కెట్ ఇవ్వకుండా, సొంత ఊరిలో మెజార్టీ రాని కొత్త ప్రభాకర్ రెడ్డికి టిక్కెట్ అమ్ముకుంది మంత్రి హరీశ్‌రావు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్, రవి, నరేందర్, యేసురెడ్డి, భరత్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఉద్యోగికి మెమో

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ప్లంబర్‌గా విధులు నిర్వహిస్తున్న సార్ల విజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో ఆదివారం మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ప్లంబర్ విజయ్‌కుమార్ తన విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెమో జారీ చేశామని దీనిపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని అన్నారు.

మద్యం పాలసీతోనే రాష్ట్రంలో పాలన



ప్రచారం చేస్తున్న రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): మద్యం పాలసీతోనే రాష్ట్రంలో పాలన సాగుతోందని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మండల పరిధిలోని చెప్యాల, అల్వాల, లింగుపల్లిలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఎన్ని వేసినా వాయిదా పడుతున్నాయని, మద్యం టెండర్లు మాత్రం విజయవంతం అవుతున్నాయని విమర్శించారు. మద్యాన్ని ఎరులై పారిస్తే తప్ప రాష్ట్రంలో పాలన సాగడం లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలు మరొక్కసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రాష్ట్రంలోనే దుబ్బాకను ఆదర్శంగా తీర్చి దిద్దుతానన్నారు. కార్యక్రమంలో అంబటి బాలేశ్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, జిల్లా నాయకులు రోశయ్య, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ కన్వీనర్ తోట సతీష్, స్కూల్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీటీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 30 నుంచి వచ్చే 1 వరకు పోటీలు కొనసాగుతున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి పది జిల్లాలోని 300 క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని, ప్రతిభ కనబర్చిన వారు నవంబర్ మూడో వారంలో త్రిపురలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు లక్ష్మణ్, తోట అశోక్, వెంకట్ స్వామి, ఉప్పలయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్, సురేశ్, బాబు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని ఆకునూరు విద్యార్థులు అశ్విని, అశ్విత రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐలయ్య ఆదివారం తెలిపారు.

చేరికల జోరు.. ప్రచార హోరు

- ఎన్నికల వేళ ప్రధాన పార్టీల్లో హడావిడి
- ప్రచారాలతో దూసుకెళ్తున్న అభ్యర్థులు
- మరో పక్క బుజ్జగింపుల పర్వం
- గజ్వేల్‌లో రసవత్తరంగా రాజకీయం



గజ్వేల్‌లో కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న యువత

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కాయి. ప్రధాన పార్టీల్లో ప్రచార హోరుతోపాటు చేరికల జోరు మొదలైంది. అసంతృప్తులను చేర్చుకునేందుకు ఇతర పార్టీలు వేగంగా పావులు కదుపుతున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తుండగా..ఈసారి తమ పార్టీ అధినేతకు లక్షకుపైగా మెజార్టీని అందించడానికి పార్టీ శ్రేణులు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సైతం వివిధ కార్యక్రమాలతో ప్రజల్లోకెళ్లే ప్రయత్నం చేస్తున్నది. బీజేపీ నాయకులు ప్రచారంలో జోరు పెంచారు.

సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలతో మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్‌ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించిన తర్వాత ఆ పార్టీలో జోష్ కనిపిస్తోంది. ఈ క్రమంలోనే కేసీఆర్ మద్దతుగా నియోజకవర్గంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన సంఘాలు, వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఏకగ్రీవ తీర్మానాలు మరింత జోరందుకున్నాయి. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గంలో ఈ ప్రక్రియను వేగంగా ముందుకు నడిపిస్తున్నారు. చేరికల కార్యక్రమాలను జోరుగా చేపడుతున్నారు. మరోవైపు కేసీఆర్ ప్రాతినిధ్యం తర్వాత నియోజకవర్గంలో వచ్చిన మార్పును వివరిస్తూ ప్రచార కార్యక్రమాలను హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని 179 గ్రామాలను ఏదో ఒక కార్యక్రమం పేరిట బీఆర్‌ఎస్ నేతలు చుట్టేశారు. మొత్తానికి నియోజకవర్గంలో ప్రచారంతోపాటూ అన్ని అంశాల్లోనూ బీఆర్‌ఎస్ ముందంజలో ఉన్నది. లక్షకు ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యంగా ఎంచుకున్న అధికార పార్టీ ముందుకుసాగుతుంది.

వ్యూహాలు.. శిక్షణలు

కాంగ్రెస్ నాయకులు సైతం తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పార్టీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి నియోజకవర్గంలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ధర్మారెడ్డిపల్లిలోని శోభ గార్డెన్స్‌లో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల అనుసరించాల్సి వ్యూహంపై కార్యాచరణ రూపొందించే పనిలో ఆ పార్టీ ప్రస్తుతం తలమునకలై ఉన్నది. బీజేపీలోనూ హడావిడి మొదలైంది. పార్టీ అభ్యర్థిగా కేసీఆర్‌పై పోటీకి సిద్ధమైన మాజీ మంత్రి ఈటల రాజేందర్ తన ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈనెల 26న 'గజ్వేల్ విజయ శంఖారావం' పేరిట సభను నిర్వహించి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి అసంతృప్తులను బీజేపీలో చేర్చుకున్నారు. ఇదే జోరును కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు.

వ్యతిరేకంగా ప్రచారం..

పార్టీల సందడి ఒకవైపు సాగుతుండగా.. ఎన్నికల ప్రచారం జోరుందుకుంటున్న వేళ కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి మరికొందరు రంగప్రవేశం చేస్తున్నారు. ఈటలకు వ్యతిరేకంగా శనివారం ఆయన సొంత నియోజకవర్గం హుజురాబాద్‌కు చెందిన కొందరు 'ఈటల దళిత బాధితుల సంఘం' పేరిట గజ్వేల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. తమను నిత్యం వేధింపులకు గురిచేస్తున్న ఈటలను గజ్వేల్‌లో ఓడించాలని కోరారు. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా తెలంగాణ అమర వీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదిక అధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టిన సంగతి తెల్సిందే.

కొనసాగుతున్న బుజ్జగింపుల పర్వం

ఎన్నికల వేళ...అసమ్మతి స్వరం వినిపిస్తున్న నేతలను బుజ్జగించే తంతు జోరుగా సాగుతోంది. ప్రత్యేకించి బీఆర్‌ఎస్‌లో నిన్నటి మొన్నటి వరకు పనిచేసి పార్టీని వీడాలనుకుంటున్న నాయకులను బుజ్జగించే పనిలో పడ్డారు. అయినా ఇప్పటికే కొంతమంది నేతలు తమ దారి తాము చూసుకోగా.. మిగితా వారు చేజారకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈటల సమక్షంలో బీజేపీలో కొందరు చేరగా, మరికొందరిని సైతం లాక్కునేందుకు ప్రయత్నిస్తుంది. వారిని కట్టడి చేయడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తుంది. ప్రత్యేకించి గజ్వేల్, ములుగు, కొండపాక మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. మొత్తానికి గజ్వేల్‌లో అసెంబ్లీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది.

● మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ బాలాజీ తెలిపారు. శనివారం సాయత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈఓ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు. అలాగే, స్వామి వారిని నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న సన్నిధిలో నాగర్‌కర్నూల్ ఎస్పీ దంపతులు

రసూలాబాద్ సర్పంచ్‌కు జాతీయ సేవారత్న అవార్డు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసూలాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాధాకృష్ణ, సంపత్ చేతుల మీదుగా జాతీయ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన సాహిత్యఅకాడమీ జాతీయ అవార్డుకు ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ స్వామి

సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి

హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

హుస్నాబాద్: కార్మిక, కర్షకులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న సీఎం కేసీఆర్ కార్మిక, కర్షక పక్షపాతి అని హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. హుస్నాబాద్ శివారులోని పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో ఆదివారం బీఆర్‌టీయూ అనుబంధ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో పెద్దిరెడ్డితోపాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పాడు చేసేందుకు మొసలికన్నీరు కార్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వస్తోందన్నారు. వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్, నేషనల్ లేబర్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజనీ, యూనియన్ నాయకులు కొడముంజ రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి మేనిఫెస్టో తీసుకెళ్లాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

గజ్వేల్(గజ్వేల్): గజ్వేల్‌లో కేసీఆర్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫె స్టోను ప్రతీ ఇంటికి తీసుకుపోవాలని కోరారు. నవంబర్ 1న కొండపోచమ్మ దేవాలయం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశం, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేశ్, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ పరిపాలనకు ఇక తిరుగులేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో అంబేడ్కర్ సంఘం, ఎస్సీ సామాజిక వర్గం సభ్యులు హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కుంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ సుభాష్, పాల్గొన్నారు.

అప్పుడు స్థాపన.. ఇప్పుడు అమ్మకం

- బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్‌లను స్థాపించింది కాంగ్రెస్సే
- వాటిని బీజేపీ విక్రయిస్తోంది
- విజయభేరి సభలో జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



అభివాదం చేస్తున్న ఖర్గే, పక్కన ఠాక్రే

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అప్పుడు మెదక్ నుంచి పోటీ చేసిన ఇందిరాగాంధీ ఈ ప్రాంతాభివృద్ధి కోసం బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించిందని, ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ వాటిని విక్రయిస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డిలో ఉన్న గంజి మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇలాంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా కేవలం రెండు, మూడు వేలను భర్తీ చేసి మోదీ సర్కారు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి పార్టీ అభ్యర్థి జగ్గారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వచ్చే తమ ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారన్నారు.

బైక్ ర్యాలీ

హెలికాప్టర్‌లో సంగారెడ్డికి చేరుకున్న ఖర్గేను కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ ద్వారా స్వాగతం పలికారు. స్థానిక తారా డిగ్రీ కాలేజీ నుంచి గంజిమైదానం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం జరిగిన సభలో బీఆర్‌ఎస్‌కు చెందిన కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో పార్టీ జాతీయ నాయకులు మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీనేత భట్టి విక్రమార్క, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, వి.హనుమంతరావు, శ్రీధర్‌బాబు, జిల్లా నాయకులు, అనంతకృష్ణ, చెర్యాల ఆంజనేయులు, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం

- సీఎం బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- నేటి మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా రాక
- అనంతరం రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు...



సభా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలో సోమవారం జరిగే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. సభా వేదిక, హెలిప్యాడ్‌తో సహా అవసరమైన ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రం వరకు పూర్తి చేశారు. పట్టణంలోని రహమాన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ పక్కన గల గ్రౌండ్‌లో సభ వేదిక ఏర్పాటు చేశారు. ఆ పక్కనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. సభా వేదిక ప్రాంగణం 50 వేల మంది జనాలకు సరిపడేలా ఉంది. అందులో ప్రెస్, వీఐపీ గ్యాలరీ, జనాలు కూర్చునేందుకు వీలుగా బారికెడ్లను ఏర్పాటు చేశారు. సుమారు 100 మందికి సరిపడేలా సభా వేదికను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల నుంచి జనాలను సమీకరిస్తున్నారు.

హెలికాప్టర్‌లో రాక

సీఎం ప్రజాఆశీర్వాద సభలో పాల్గొనేందుకు నారాయణఖేడ్‌కు హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు రానున్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో బహిరంగ సభ అనంతరం నేరుగా ఖేడ్‌కు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. బీఆర్‌ఎస్ ఖేడ్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ , జిల్లాకు చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొంటారు. సభ అనంతరం కేసీఆర్ రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు వెళతారు. కాగా ఏర్పాట్లను భూపాల్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. సభా వేదిక, బారికెడ్ల ఏర్పాట్లు, హెలిప్యాడ్ నిర్మాణం తదితర పనులను పరిశీలించిన వారు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. హెలిప్యాడ్‌ను జాగిలాలతో, పోలీసులు మెటల్ డిటెక్టర్ల సహాయంతో తనిఖీలు చేశారు.

భారీ బందోబస్తు

ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 400 మంది పోలీసులను నియమించారు. ఎస్పీ పర్యవేక్షణలో ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 40 మంది వరకు ఎస్ఐలు, ఏఎస్ఐలు, 300 మంది వరకు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు

వాహనాలకు పార్కింగ్ స్థలాలను కేటాయించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. వీఐపీల వాహనాల కోసం సభా స్థలికి సమీపంలోని వాగ్దేవీ జూనియర్ కళాశాల ఎదురుగా, కంగ్టి, సిర్గాపూర్ వైపుల నుంచి వచ్చే వాహనాలకు కంగ్టి రోడ్డు పక్కన గల రాజన్నదాబా వద్ద, నాగల్‌గిద్ద, మనూరుల వైపు నుంచి వచ్చే వెహికల్స్‌కు ఈ తక్షిల పాఠశాల వద్ద, రాయిపల్లి వైపు నుంచి వచ్చే వాహనాల కోసం పంచగామ కమాన్ వద్ద, నిజాంపేట్, కల్హేర్, పెద్దశంకరంపేట మండలాల వైపు నుంచి వచ్చే వాహనాల కోసం సేవాలాల్ చౌక్ వద్ద పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు.

విద్యా ప్రమాణాల పరిశీలనే లక్ష్యంగా..

- స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే
- ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో వచ్చేనెల 3న నిర్వహణ
- జిల్లాలో 782 పాఠశాలలు ఎంపిక



నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు, భాష, గణిత, చిత్రలేఖన తదితర అంశాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)ను జిల్లాలో నిర్వహించనున్నారు. ఈ సర్వేను జిల్లా వ్యాప్తంగా నవంబర్ 3న నిర్వహించనున్నారు. ఇందుకోసం లోకల్‌బాడీ, ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ, యూఆర్ఎస్, గురుకులాలు, నవోదయ, కేంద్రీయ, ప్రైవేట్‌కు సంబంధించిన 782 విద్యాలయాలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో పరిధిలోని ఫౌండేషన్ లెవల్ (3వ తరగతి), ప్రిపరేటరీ లెవల్ (6వ తరగతి), సెకండరీ లెవల్ (9వ తరగతి) దాదాపుగా 19,500 మంది విద్యార్థులకు సంబంధించిన విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు నాలుగు ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించారు. మరో రెండు ప్రాక్టీస్ పరీక్షలను ఈనెల 31, నవంబర్ 2న నిర్వహించనున్నారు. పరీక్ష పేపర్‌లను ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో తయారు చేశారు. ఫైనల్ పరీక్షను నవంబర్ 3న నిర్వహించనున్నారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా సర్వేను పూర్తి చేయనున్నారు. అందుకుగాను 861 మంది క్షేత్ర పరిశీలకులను విద్యాశాఖ సిద్ధం చేసింది.

మెయిన్ పరీక్ష..

3వ, 6వ తరగతి విద్యార్థులకు భాషకు సంబంధించి 20, గణితంకు సంబంధించి 20 ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా 9వ తరగతి విద్యార్థులకు భాషకు సంబంధించి 30 ప్రశ్నలు, గణితంకు సంబంధించి 30 ప్రశ్నలు అడుగనున్నారు. ఈ పరీక్షను సంబంధిత ఉపాధ్యాయులు కాకుండా ఎన్‌సీఈఆర్టీకి సంబంధించిన నిపుణులు నిర్వహించనున్నారు. ఫలితాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. వీటి ఆధారంగా వెనుకబడిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా, వినూత్న మార్పులు చేస్తూ ఉపాధ్యాయులు బోధించనున్నారు. విద్యార్థులతోపాటు సంబంధింత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పరిపాలన అంశాలకు సంబంధించి పరీక్షను రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్ష ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి ర్యాంక్ కేటాయించబడుతుంది.

మెయిన్‌కు సిద్ధం చేస్తున్నాం



స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) విద్యార్థులకు లబ్ధి చేకూర్చనుంది. జిల్లాలో ఈ సర్వేలో భాగంగా నాలుగు పరీక్షలు నిర్వహించాం. మరో రెండు పరీక్షలు పూర్తి చేసి, నవంబర్ 3న నిర్వహించే మెయిన్ పరీక్షకు సిద్ధమవుతున్నాం. అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఈ సర్వేతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు తెలుసుకునే అవకాశాం లభిస్తుంది.

–భాస్కర్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి

ఐదుగురూ పటాన్‌చెరు వాసులే..!

అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణానికి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఎన్నిక



దసరా ఉత్సవానికి ఎమ్మెల్యేతో కలిసి వస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణం అయిదుగురు ఎమ్మెల్యేలను అందించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణానికి చెందిన అయిదుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 2009 వరకు పటాన్‌చెరు సంగారెడ్డిలో అంతర్భాగంగా ఉండేది. పటాన్‌చెరు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో టీ.నందీశ్వరగౌడ్ తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పటాన్‌చెరు సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఉన్నప్పుడు కూడా పట్టణానికి చెందిన నర్సింహారెడ్డి(1967), సదాశివరెడ్డి (1994), కే.సత్యనారాయణ(1999) ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మరో విషయం ఏమిటంటే ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారందరి నివాసాలు పట్టణంలో పక్కపక్కనే ఉంటాయి. దివంగత మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి ఇంటి ఎదురుగా ప్రస్తుత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నివాసం ఉంటుంది. ఇతని గృహానికి వంద మీటర్ల దూరంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ఇల్లు ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారందరి ఇళ్లు కొన్ని మీటర్ల దూరం లోపే ఉండటం విశేషం.

ఎన్నికల సమయంలోనే..

2007 వరకు పటాన్‌చెరు పంచాయతీగా ఉండేది. ఆ తర్వాతే ఇది హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చింది. ఈ పట్టణంలోని రాజకీయ నాయకులు ఎన్నికల వేళ మాత్రమే విమర్శలు చేసుకుంటారు. మిగతా సమయంలో కలిసి మెలసి ఉంటారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

జనగామ బీజేపీ అభ్యర్థి దశమంతరెడ్డి



హోటల్‌లో టీ పోస్తున్న దశమంతరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలంటే బీజేపీ కి ఓటు వేయాలని జనగామ ఆ పార్టీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మద్దూరు మండలం లద్నూరు, మర్మాముల, రేబర్తి గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ప్రధాని మోడీ చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని అన్నారు. దేశంలో 5కోట్ల ఇళ్లను నిర్మించిన ఘనత మోడీ కే దక్కిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వాటిని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లించి సీఎం కేసీఆర్ దోచుకున్నాడని ఆరోపించారు. పేపరు లీకేజీలు చేసి నిరుద్యోగుల ఆత్మహత్యకు కేసీఆర్ కారణమయ్యాడని విమర్శించారు. స్థానికేతరునికి ఓటు వేస్తే నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోదని తెలిపారు. స్థానికుడైన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్ఎన్ రాజు, ఉడుగుల రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్, బొంగోని సురేష్‌గౌడ్, సోగాల మనోజ్‌కుమార్, నలసాని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

నోటా.. పెరుగుతోంది వాటా..!

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభావం ఎక్కువే..
- ఎన్నికలు జరిగిన ప్రతిసారీ అధికమవుతున్న 'నోటా' ఓట్ల సంఖ్య

(మెదక్ డెస్క్)



నోటా (NOTA) ఈ పదం ఎక్కువగా ఎన్నికల సమయంలో వినపడుతూ ఉంటుంది. ఈవీఎం మిషన్లపై చివరగా ఉండే ఈ నోటా గురించి చాలా మందికి పెద్దగా తెలియకపోవచ్చు. తెలిసిన వారు కొందరు దీనిని ఉపయోగిస్తారు. రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి.. నానాటికీ తీసికట్టుగా మారిపోతున్నాయి. ఓటు వేసేందుకు సరైన వారు ఒక్కరూ కనిపించడం లేదని అనుకునే వారి కోసం ఈ 'నోటా' మీటను కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. ఎన్నికల్లో నిలబడిన వ్యక్తుల్లో మనం ఓటు వేసేందుకు అర్హత లేదని గుర్తిస్తే ఈవీఎంలపై ఉన్న నోటా బటన్‌ను నొక్కుతున్నారు. ఎన్నికల సంఘమైతే దానిని ప్రవేశపెట్టింది సరే.. మరి దానిని ఎవరైనా వినియోగిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానం వస్తుంది. దీనిని ప్రవేశ పెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రతి ఎన్నికల్లో నోటా బటన్‌ను నొక్కే వారి సంఖ్య ప్రతీ ఎన్నికల సమయంలో పెరుగుతూ వస్తుంది.

సుప్రీం కోర్టు సూచనతో..

2014 సార్వత్రిక ఎన్నికల్లో నోటాను ఎన్నికల సంఘం అమల్లోకి తీసుకువచ్చింది. అభ్యర్థులెవరూ నచ్చకపోతే తిరస్కరించే అవకాశం ఓటరుకు ఉండాలని పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా విభాగాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్న తరుణంలో నోటాను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నికల సంఘం 2009లో తొలిసారిగా సుప్రీం కోర్టుకు చెప్పింది. ప్రభుత్వం దీనిని వ్యతిరేకించినప్పటికీ పలు సంస్థలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. దీంతో నోటాను అమల్లోకి తీసుకురావాలని సుప్రీం కోర్టు 2013 సెప్టెంబర్ 27న తీర్పును వెలువరించింది.

ఎప్పటి నుంచో ఉన్న తిరస్కరణ ఓటు

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నచ్చకుంటే తిరస్కరణ ఓటు వేసే హక్కును భారత రాజ్యాంగం ఎప్పుడో కల్పించింది. ప్రజా ప్రాతినిథ్య చట్టంలోని సెక్షన్ 49(ఓ) కింద ఓటర్లు ఈ హక్కును వినియోగించుకునే వీలుంది. పోలింగ్ బూత్‌లోని ప్రిసైడింగ్ అధికారి దగ్గర దీనికోసం 17–ఏ ఫారం తీసుకుని ఫలానా అభ్యర్థిని తిరస్కరిస్తున్నానని తెలుపుతూ సంతకం లేదా వేలి ముద్ర వేసి బ్యాలెట్ పెట్టెలో వేయవచ్చు. రహస్య బ్యాలెట్ విధానానికి ఇది విరుద్ధమని, ఓటరు భద్రత దృష్ట్యా ఇది సరైన పద్ధతి కాదని వ్యతిరేకత ఉండేది. ఈవీఎంలు అందుబాటులోకి రావడంతో ఎన్నికల సంఘం నోటాను అమలు చేసింది.

పెరుగుతున్న ఆదరణ

2014, 2018లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం కల్పించడంతో నోటాకు ఓటు వేసే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఓటర్లు నోటా బటన్‌ను నొక్కేస్తున్నారు. 2014లో తొలిసారిగా నోటాను బ్యాలెట్ షీట్‌లో చేర్చారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటాకు 14,899 ఓట్లు పోలైతే, 2018లో 20,739 ఓట్లు పోలయ్యాయి. 2018 ఎన్నికల్లో పలువురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం విశేషం. సిద్దిపేట నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులకు, మెదక్‌లో 8 మంది, నారాయణఖేడ్‌లో 6, అందోల్‌లో 5, నర్సాపూర్‌లో 3, జహీరాబాద్‌లో 10, సంగారెడ్డిలో 10, పటాన్‌చెరులో 11, దుబ్బాకలో 11, గజ్వేల్‌లో 9, హుస్నాబాద్ నియోజకవర్గంలో 11 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.

నోటాకు పోలైన ఓట్లు..

నియోజకవర్గం	2018	2014
సిద్దిపేట	2,932	1,664
మెదక్	2,263	1,602
నారాయణఖేడ్	1,554	1,035
అందోల్	1,510	1,472
నర్సాపూర్	1,669	1,229
జహీరాబాద్	1,884	1,195
సంగారెడ్డి	1,402	985
పటాన్‌చెరు	1,487	1,157
దుబ్బాక	880	1,519
గజ్వేల్	1,624	1,592
హుస్నాబాద్	3,534	1,449

నోటా అంటే..?

నోటా ('నన్ ఆఫ్ ది అబో') అంటే.. 'పైన నిలబడిన వ్యక్తుల్లో ఎవరూ కాదు' అని అర్థం. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులలో ఎవరూ నచ్చలేదని చెప్పేందుకు ఎన్నికల సంఘం దీనిని తీసుకొచ్చింది. పోలింగ్ శాతం పెంచడం, ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించడమే దీని ఉద్దేశం. తెలంగాణలో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలామంది నోటాను ఎంచుకున్నారు. నోటా ప్రభావం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కువగానే ఉంది. ఎన్నికలు జరిగిన ప్రతీసారి నోటాకు పడుతున్న ఓట్ల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. ఎంతలా అంటే.. పలుచోట్ల అభ్యర్థుల తలరాతను మార్చేంతలా ఉంది. గెలిచిన అభ్యర్థికి వచ్చిన ఆధిక్యం కంటే నోటాకు పోలైన ఓట్లే ఎక్కువ.. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో మూడు వేలకు పైగానే ఓట్లు పడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు.

రుణం తీర్చుకుందాం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి కేసీఆర్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇస్తూ మోసం చేయాలని చూస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతిపక్ష పార్టీలకు నిద్రపట్టకుండా చేశాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, మల్లం ఐలయ్య, కిరణ్‌కుమార్‌చారి, కోల శ్రీనివాస్, మహిపాల్, కాచం నవీన్‌కుమార్, కందూరి ఐలయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి పార్టీని ఆశీర్వదించండి

బీఆర్ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ఆ పార్టీ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.మాణిక్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మన్‌పల్లి, కప్పాడ్, కొల్లూర్, కంబాలపల్లి, నర్సాపూర్, గుంతమర్పల్లి, జునేగావ్, ప్యారవరం, బోప్పన్‌పల్లి గ్రామాల్లో ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, మజీదులు, చర్చిల్లో పూజలు చేసి, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని తెలిపారు. ఆ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ స్థానికుడు కాదని, వివిధ పార్టీలు మారిన వ్యక్తి అని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ నరోత్తం, ఉమాకాంత్‌పాటిల్ పాల్గొన్నారు.

వికారాబాద్ ఓటర్లు ఛీదరించడంతోనే ఇక్కడికి

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను వికారాబాద్ ప్రజలు ఛీదరించుకోవడంతోనే జహీరాబాద్‌కు వచ్చి పోటీ చేస్తున్నారని, ఇక్కడి ప్రజలు ఆలోచించి ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెప్పాలని మాణిక్‌రావు కోరారు. ఆదివారం మొగుడంపల్లి మండలం ఇప్పెపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వికారాబాద్ ఎస్సీ నియోజకవర్గమని, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ అక్కడి నుంచి రెండు మూడు సార్లు గెలిచి మంత్రి కూడా అయ్యారని చెప్పారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేస్తే అక్కడి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. సొంత నియోజకవర్గమైన వికారాబాద్ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నా జహీరాబాద్ నుంచే ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానికుడినైన తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, జెడ్పీటీసీ అరుణ విజయమోహన్‌రెడ్డి, సర్పంచ్ సురేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్‌శెట్టి మామిడ్గి పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



ఇంటింటి ప్రచారం చేస్తున్న పొన్నం ప్రభాకర్

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విరక్తి చెందిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కేబీ కాలనీలో ఆదివారం ఆయన కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డుల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని, డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మొదటి విడతగా ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇంటి పథకం కింద రూ.5లక్షలు ఇస్తామని పొన్నం భరోసా ఇచ్చారు. కేసీఆర్‌ను ఇంటికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోనగిరి రజిత తదితరులు ఉన్నారు.

గ్యారంటీగా ఆరు పథకాలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

అకోహీర్(జహీరాబాద్): కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయకపోతే తాను స్వచ్ఛందంగా రాజీనామా చేస్తానని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని దిగ్వాల్, కవేలి, కొత్తూరు(డి), వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అమలుకు వీలు కాని హామీలు ఇస్తూ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఓ వ్యక్తికి అధిక ప్రాధాన్యతనిస్తూ తమను నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ అశోక్ ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు కావాలనే తమను దూరంగా ఉంచుతున్నారని ఆరోపించారు. ఈ గొడవ చంద్రశేఖర్ సమక్షంలో జరగడం విశేషం.

కేసీఆర్ గెలుపులో యువతే కీలకం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని అందించిన గజ్వేల్ చరిత్ర తెలంగాణ పుటల్లో నిలిచిపోతుందని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత యువతేదే అని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ లు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అనంతరం పలువురు యువకులు కేసీఆర్‌ను భారీ మెజారీతో గెలిపిస్తామని తీర్మాన ప్రతులను ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. కాగా, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 16 వార్డుల నుంచి 20 వార్డులుగా విభజించి నాలుగు వార్డుల్లో యువతకే అవకాశమిచ్చే విధంగా చర్యలు తీసుకుంటాని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తూప్రాన్ నియోజకవర్గం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంది.

త్వరలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న రాజిరెడ్డి

ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్వగ్రామమైన మాసాయిపేటలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని శ్రీ విఠలేశ్వర స్వామి, సాయిబాబా, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీ సత్తా చాటుతాం



మాట్లాడుతున్న విజయ భాస్కర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ టీపీ సత్తా చాటుతుందని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి మందాడి విజయ భాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే తాను దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. వైఎస్సార్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి సైనికుల్లా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దుబ్బాక గడ్డపై వైఎస్సార్ టీపీ జెండాను ఎగరేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్, ఎల్లం, దేవదాసు, ఎల్లయ్య, రమేష్, పరుశరాములు, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ నిర్మాణం అసత్య ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండల పరిధిలో పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జప్తి లింగారెడ్డిపల్లి, సింగరాయి దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లింగాపూర్, ఎల్ బంజేరుపల్లి, వెంకట్రావుపేట, రాంపూర్, తొగుటలో ప్రచార ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పవర్ ప్లాంట్ జరుగుతోందని అసత్య ప్రచారం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదని తెలిపారు. కల్లబొల్లి మాటలు నమ్మి గత ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావును బీజేపీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే దుబ్బాక నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, కాన్గల్ సొసైటీ చైర్మన్ హరి కిషన్‌రెడ్డి, బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, దోమల కొమురయ్య, కందిరాంరెడ్డి, గోవర్ధన్, లత పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన సీఎం



లెనిన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని జనగామ ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లెనిన్‌నగర్ గ్రామంలో కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మాజీ ఎంపీపీలు బొడిగె నర్సింహులు, పరమేశ్వర్, పుర్మ ఆగంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీ బీసీలను విస్మరించిందని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం రామాయంపేటలో జరిగిన పార్టీ మెదక్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల వరకు ముదిరాజ్ కులస్తులుండగా, వారికి ఒక్క సీటు కూడా కేటాయించలేదని, బీఆర్ఎస్ బీసీ వ్యతిరేకి అని ఆరోపించారు. అన్ని పథకాల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్‌సింగ్, నందారెడ్డి, పంజా విజయకుమార్, రాగి రాములు, శంకర్‌గౌడ్, దయానందరెడ్డి, చంద్రశేఖర్, రాజు, సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు